సాక్షి విజయనగరం

బుధవారం । 12 । మార్చి । 2025



విద్యార్థులకు ఇస్రో పిలుపు

విద్యార్థి దశ నుంచి సైన్స్‌పై మక్కువ చూపుతూ..నూతన ఆవిష్కరణల పట్ల ఉత్సాహం చూపే విద్యార్థులను ఇస్రో ప్రోత్సహిస్తోంది.

- 8లో



డీకేటీ రైతులకు అన్యాయం..!

భూదార్ నమోదులో పట్టదారు రైతులకు కూటమి ప్రభుత్వం మొండిచేయి చూపు తోంది. ఆవేదన మిగుల్చుతోంది.

- 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహార్
బుధ (సా)	గురు (ఉ)
6.11	4.44

న్యూస్‌రీల్

15తో ముగియనున్న చెరకు క్రషింగ్

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామం వద్ద ఉన్న ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారంలో చెరకు క్రషింగ్ ఈ నెల 15తో ముగియనుందని యాజమాన్య ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 సంవత్సరానికి 3.25లక్షల మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్ చేసినట్టు పేర్కొన్నారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం ప్రాంతాల నుంచి మిగులు చెరకును ఈ నెల 15లోగా కర్మాగారానికి తరలించేందుకు రైతులు ముందుకు రావాలని కోరారు. చెరకు క్రషింగ్‌కు సహకరించిన రైతులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



గొబ్యాంలో వేతన దారులతో మాట్లాడుతున్న ఎన్ఆర్ఈజీఎస్ డైరెక్టర్ షణ్ముఖ్‌కుమార్

గజపతినగరం రూరల్/దత్తిరాజేరు: గజపతినగరం మండలంలోని పట్రువాడ, చిట్టేయవలస, దత్తిరాజేరు మండలంలోని ఇంగిలాపల్లి, గొభ్యాం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఎన్ఆర్ఈజీఎస్ డైరెక్టర్ షణ్ముక్ కుమార్ మంగళవారం పరిశీలించారు. ఫారం పాండ్‌లు, ఫిష్ పాండ్‌ల నిర్మాణంపై వేతనదారులకు పలు సూచనలిచ్చారు. వేతనదారులకు రోజుకు రూ.300 వేతనం తక్కువ కాకుండా పనులు కల్పించాలని ఫీల్డు అసిస్టెంట్లను ఆదేశించారు. ఉపాధిహామీ పనులతో సాగునీటి వనరులను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట కాలుష్య నియంత్రణాధికారి గోపీచంద్, డ్వామా పీడీ శారదాదేవి, అడిషనల్ కమిషనర్ శివప్రసాద్, ఎంపీడీఓలు కల్యాణి, రాజేంద్రప్రసాద్ ఏపీడీ రమామణి, ఏపీఓలు చప్పరామారావు, అప్పలనాయుడు ఉన్నారు.

- మద్దువలస కుడికాలువలో పిల్లలతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం
- ఏడేళ్ల కుమార్తె సైనీ గల్లంతు
- కాలువలో దూకిన పదేళ్ల బాలుడు, మహిళను రక్షించిన స్థానిక యువకుడు
- బాలిక కోసం గాలింపు
- ఆర్థిక, మానసిక సమస్యలే కారణమన్న పోలీసులు



శ్రావణి, సిద్దులను ఒడ్డుకు చేర్చిన అనంతరం పోలీసులకు ఫోన్‌లో సమాచారం ఇస్తున్న యువకుడు జన్ని జగన్‌మోహన్(చిన్ని)

తల్లీ.. నీకు ఎంత కష్టమొచ్చింది..!

వంగర:

ఓ వైపు మానసిక స్థితి సరిగాలేక దూరంగా ఉంటున్న భర్త..
మరోవైపు పెద్దవారవుతున్న పిల్లల బాగోగులు చూసుకోవాల్సిన బాధ్యత..
అన్నింటికీ తల్లిదండ్రులపైనే ఆధారపడాల్సిన పరిస్థితులు.. ఆ తల్లిని మనోవేదనకు గురిచేశాయి. ఆర్థికంగా, మానసికంగా కుంగదీశాయి.
నవమాసాలు మోసి కనీపెంచిన పిల్లలను బలవంతంగా లాక్కొచ్చి కాలువలో దూకి ప్రాణాలు తీసుకునేంత స్థాయికి దిగజార్చాయి. ఓ యువకుడి సాహసంతో ఈ ప్రమాదంలో తల్లీ, కుమారుడు ప్రాణాలతో బయటపడగా.. కుమార్తె గల్లంతైన విషాదకర ఘటన వంగర మండలం మద్దువలస కాలువ వద్ద మంగళవారం చోటుచేసుకుంది.
పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

వంగర మండలంలోని కింజంగి గ్రామానికి చెందిన గుంట తవుడు, కళావతిల రెండో కుమార్తె శ్రావణికి పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం గంగాడ గ్రామానికి చెందిన కళింగ సుధాకర్‌తో 11 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి సిద్ధు, సైనీ(7)లు పుట్టిన తరువాత భర్త సుధాకర్ మానసిక స్థితి సరిగా లేకపోవడంతో శ్రావణి కింజంగిలోని తల్లిదండ్రుల చెంతకు చేరింది. ఐదేళ్లుగా తల్లిదండ్రుల వద్దనే ఉంటూ పొందూరులోని ఓ నర్సింగ్ కళాశాలలో ఎనస్తీషియాలో డిప్లమా చేస్తోంది. కుమారుడు సిద్ధు రేగిడి మండలం ఉంగరాడమెట్ట వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఐదో తరగతి, కుమార్తె సైనీ కింజంగి ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. మూడు రోజుల కిందట గరుగుబిల్లి మండలం బురదవెంకటాపురంలోని అక్క సంధ్య ఇంటికి పిల్లలతో కలిసి వెళ్లింది. కుమారుడుని ఉంగరాడమెట్ట వద్ద గురుకులానికి తీసుకెళ్తానని చెప్పి మంగళవారం తిరుగుప్రయాణమైంది. మార్గం మధ్యలో వంగర మండలంలోని మద్దువలస కుడి ప్రధాన కాలువ వద్దకు మధ్యాహ్నం 2.45 గంటల సమయంలో చేరుకుని పిల్లలతో కలిసి దూకేసింది. చేపల వేటకు అటువైపుగా వెళ్తున్న సంగాం గ్రామానికి చెందిన యువకుడు జన్ని జగన్‌మోహన్(చిన్ని) వారిని గమనించి హుటాహుటిన కాలువలోకి దూకి శ్రావణి, సిద్ధులను కాపాడి ఒడ్డుకు చేర్చాడు. బాలికను కాపాడే ప్రయత్నంలో మరోసారి శ్రావణి తన కుమారుడితో కలిసి దూకేయడంతో మళ్లీ ఒడ్డుకు చేర్చాడు. ఇంతలో బాలిక సైనీ నీటిలో కొట్టుకుపోయింది. స్థానికుల సమాచారంతో ఎస్ఐ షేక్‌శంకర్, వంగర తహసీల్దార్ దిరిశాల ధర్మరాజు, పోలీసులు, రెవెన్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. మద్దువలస ప్రాజెక్టు అధికారులకు సమాచారం ఇచ్చి కాలువ హెడ్‌స్లూయిస్ వద్ద గేట్లు మూసివేయించారు. గజఈతగాళ్లు, మత్స్యకారులతో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి సమయం కావడంతో బాలిక ఆచూకీ లభించలేదు. బాలిక గల్లంతైనట్టు కేసు నమోదు చేశారు. భర్తకు దూరంగా ఉండడం, మానసిక, ఆర్థిక సమస్యలతో ఈ దారుణానికి ఒడిగట్టినట్టు ప్రాథమికంగా నిర్ధారించినట్టు ఎస్ఐ తెలిపారు.



కళింగ సైనీ (ఫైల్)

కన్నీటి రోదన

నవమాసాలు మోసి కనీపెంచిన ఇద్దరు పిల్లలతో కలిసి శ్రావణి ఆత్మహత్యాయత్నానికి ప్రయతి్నంచిన ఘటనతో బంధువులు కన్నీటిపర్యంతమయ్యారు. మద్దువలస కాలువ వద్దకు చేరుకుని తల్లీ నీకు ఏ కష్టమొచ్చింది.. ఇంత దారుణానికి ఒడిగట్టావంటూ కన్నీరుకార్చారు. మేమంతా నీకు ఉండగా... ఒంటరినని ఎలా భావిస్తావంటూ తల్లిదండ్రులు గుంట తవుడు, కళావతి, బంధువులు విలపించిన తీరు అక్కడివారిని కన్నీరుపెట్టించింది. ఒడ్డుకు సురక్షితంగా చేరి బిక్కుబిక్కుమంటున్న కుమారుడుని చూసి ప్రమాదం నుంచి బయటపడిన ఆ తల్లి సైతం నిశ్చేష్టురాలైంది. కుమార్తె గల్లంతుతో ఆమె మనసు శోకసంద్రమైంది. ఈ హృదయవిదారకర ఘటనతో మద్దువలస కాలువ పరిసరాలు మౌనందాల్చాయి.



ఘటనా స్థలం వద్ద రోదిస్తున్న బంధువులు

నేడు యువత పోరు

విజయనగరం: కూటమి నేతలు ఎన్నికలకు ముందు యువతకు ఇచ్చిన హామీలు అమలుచేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ పోరుబాటకు పిలుపునిచ్చింది. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం యువత పోరు నినాదంతో జిల్లా కేంద్రంలో నిరసన అనంతరం కలెక్టర్‌కు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని అందజేయనున్నట్టు జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు వెల్లడించారు. ఉదయం 9 గంటలకు విజయనగరంలోని కంటోన్మెంట్ మున్సిపల్ పార్కువద్ద ముందుగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ నేతలతో కలిసి జెండా ఆవిష్కరణ చేస్తామన్నారు. అనంతరం యువత, విద్యార్థులతో కలిసి నిరసన ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు, మాజీ ప్రజాప్రతినిధులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, పార్టీ మండలాధ్యక్షులు, ఇతర ప్రజాప్రతినిధులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సమయం:	వేదిక:
ఉదయం 9 గంటలకు	మున్సిపల్ పార్కు, విజయనగరం కంటోన్మెంట్

23న వయోజనులకు అక్షరాస్య అర్హత పరీక్ష

- ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య నిర్వహణ

విజయనగరం అర్బన్: జిల్లాలో ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా శిక్షణ పొందిన వయోజనులకు అక్షరాస్య అర్హత పరీక్ష (ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ అసెస్మెంట్ టెస్ట్)ను ఈ నెల 23న జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తామని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. తన చాంబర్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో పరీక్ష నిర్వహణపై జిల్లా అధికారులకు పలు సూచనలు చేశారు. ఉల్లాస్ కార్యక్రమంలో జిల్లాలో 48 వేల మంది అక్షరాస్యత కోర్సుపై శిక్షణ పొందారని, వీరి అర్హత పరీక్ష కోసం జిల్లా వ్యాప్తంగా 875 పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. పరీక్షను ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల మధ్యలో నచ్చిన సమయంలో 3 గంటల పాటు నిర్వహించాలన్నారు. పరీక్షల నిర్వహణకు ఇన్విజిలేటర్లుగా అర్హత కలిగిన అంగన్‌వాడీ టీచర్లను నియమించాలని అధికారులకు సూచించారు. పరీక్షల పరిశీలకులుగా డీఆర్‌డీఏ ఏపీఎంలను నియమించాలన్నారు. వీరి పరీక్ష అనంతరం జవాబు పత్రాలు, రిజిస్ట్రేషన్ పత్రాలు, హాజరు పత్రాలు, మార్క్స్ అవార్డు సీట్‌లు నిర్దేశిత ప్రొఫార్మాలో ఎక్సెల్ షీట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. సమావేశంలో వయోజన విద్య డీడీ అల్లు సోమేశ్వరరావు, ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ ప్రసన్న, డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి, వయోజన విద్యాశాఖ ఏపీఓ ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

30 కేజీల గంజాయి పట్టివేత

పాచిపెంట: మండలంలోని పి.కోనవలస చెక్‌పోస్టు దుర్గ గుడి వద్ద 30 కేజీల గంజాయిని పట్టుకున్నట్లు ఎస్సై వెంకటసురేష్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ, సోమవారం పి.కోనవలస చెక్‌పోస్టు సమీపంలో దుర్గ గుడి వద్ద ముగ్గురు వ్యక్తులు గంజాయితో పట్టుబడ్డారన్నారు. పట్టుబడిన వారిలో కర్ణాటక, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన మహమ్మద్ షఫీజ్, దివ్యాన్షు శుక్లా, ఓం శుక్లాల నుంచి 30 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు.



క్లుప్తంగా

జూడో రాష్ట్రస్థాయి పోటీలకు కేజీబీవీ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులు

నెల్లిమర్ల: పట్టణంలోని కేజీబీవీ విద్యార్థులు జూడో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.ఈ నెల 15, 16 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ జూడో పోటీలకు జిల్లా నుంచి మహిళల విభాగంలో ఈ పాఠశాలకు చెందిన జె కావ్య, పి పావని, పి జ్యోత్స్న రాణి, ఎస్.ఢిల్లీశ్వరి, కె భార్గవి, బి.దీపిక, సత్య, అనూష, జయలక్ష్మి ఎంపికై నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఉమ తెలిపారు. వారిని పీఈటీ రమణి, ఉపాధ్యాయినులు అభినందించారు.

అంతర రాష్ట్ర ఫెన్సింగ్ క్రీడలకు విద్యార్థి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణరావు

విజయనగరం అర్బన్: కేరళలో ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు జరిగే ఫెన్సింగ్ క్రీడలో అంతర్ రాష్ట్ర పోటీలకు పట్టణానికి చెందిన సత్య డిగ్రీ/ పీజీ కళాశాల విద్యార్థి కె.పవన్‌కుమార్ ఎంపికయ్యాడు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీసాయిదేవమణి మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.ఎంపికైన విద్యార్థిని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, కళాశాల అధ్యాపకులు అభినందించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం ఆదినారాయణ

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధి జరజాపుపేట ఉన్నత పాఠశాల విద్యార్థి మద్దిల మోహనకృష్ణ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 14వ తేదీ నుంచి కడప జిల్లాలో జరిగే ఉమ్మడి బాలబాలికల చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా జట్టు తరఫున పాల్గొంటాడు. మోహనకృష్ణను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రేవల్ల ఆదినారాయణ, వ్యాయామ ఉపాధ్యాయుడు నడిపేన సూర్యనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇంటి స్థలం కోసం తల్లి, సోదరుడిపై దాడి

విజయనగరం క్రైమ్: విజయనగరం మండలంలోని ముడిదాంలో ఇంటి జాగా కోసం కన్నతల్లిపైనే దాడి చేశాడు ఓ మాజీ ఆర్మీ జవాన్. అలాగే అడ్డువచ్చిన అన్నపైన కూడా దాడికి పాల్పడ్డాడు. ఇందుకు సంబంధించి రూరల్ ఎస్సై అశోక్ మంగళవారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. ముడిదాంకు చెందిన మజ్జి పైడితల్లికి ఇద్దరు కొడుకులు. చాలా రోజుల నుంచి ఇంటి జాగాపై అన్న దమ్ముల మధ్య గొడవలు జరుగుతునే ఉన్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఆ తగాదా తారస్థాయికి చేరడంతో చిన్నకొడుకు, మాజీ సైనికుడు మజ్జి శివ దుశ్చర్యకు దిగాడు. తనకు ఇంటి జాగా ఇవ్వడం లేదని తల్లి, అన్న కలిసి అన్యాయం చేశారంటూ తల్లి, సోదరుడిపైనే దాడికి దిగాడు. ఇంట్లో ఉన్న ఓ ఆయుధంతో దాడి చేశాడు. ఈ సమాచారం తెలుసుకున్న సమీప బంధువు రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై అశోక్ హుటాహుటిన ఘటనా స్థలికి వెళ్లి వివరాలు సేకరించారు. గాయాలపాలైన అందరినీ విజయనగరం సర్వజన ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. అన్నపై దాడికి పాల్పడిన మాజీ ఆర్మీ జవాన్‌పై అన్న తాలూకా వారు దాడికి దిగడంతో శివ కూడా హాస్పిటల్ పాలయ్యాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹98	₹166	176

NELLIMARLA NAGAR PANCHAYAT
Notice inviting for the 3rd Party Quality Control Assurance System

Name of the Work: 3rd Party Quality Control Assurance System to all works exceeding above Rs. 1.00 Lakh estimate cost of Nellimarla Nagar Panchayat for 3 Years.

Last Date of Submitting Quotation to the Commissioner Nellimarla Nagar Panchayat.	: Dt: 19.03.2025
Experience	: Minimum 5 years of experience in any other Municipality should submit along with quotation
Last Date for Submission of Bid Documents	: Dt: 19.03.2025 up to 4.00 PM
Opening of Bid Documents	: Dt: 19.03.2025 at 5.00 PM
EMD	: Rs. 10,000/- Demand Draft in favour of Commissioner, Nellimarla Nagar Panchayat.

The bid documents should submit in the sealed cover to the Commissioner, Nellimarla Nagar Panchayat. If any quarry please contact Assistant Engineer I/c. of Nellimarla Nagar Panchayat 8520008977.

Commissioner, Nellimarla Nagar Panchayat

విద్యార్థులకు ఇస్రో పిలుపు

- అంతరిక్షం.. స్పేస్ అప్లికేషన్‌పై అవగాహన
- 9వ తరగతి విద్యార్థులకు చక్కటి అవకాశం
- మార్చి 23 వరకు దరఖాస్తుల స్వీకరణ



ఈ తరహా తొమ్మిదవ తరగతి విద్యార్థులు యువికా దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు

పాలకొండ రూరల్: విద్యార్థి దశ నుంచి సైన్స్‌పై మక్కువ చూపుతూ..నూతన ఆవిష్కరణల పట్ల ఉత్సాహం చూపే విద్యార్థులను భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రోత్సహిస్తోంది. యువిక (యంగ్ సైంటిస్ట్)–2025 పేరిట ఉపగ్రహ ప్రయోగాలను తెలుసుకునేందుకు, శాస్త్రవేత్తలతో మాట్లాడేందుకు 9వ తరగతి విద్యార్థులకు అవకాశం కల్పిస్తోంది.

లక్ష్యాలు..

- భారత అంతరిక్ష పరిశోధనలను విద్యార్థులకు పరిచయం చేయడం
- విద్యార్థులను స్పేస్ టెక్నాలజీ వైపు ప్రోత్సహించడం
- అంతరిక్ష పరిశోధకులుగా వారిని సిద్ధం చేయడం

దరఖాస్తు చేసే విధానం..

ఈ నెల 23వ తేదీలోగా విద్యార్థులు నాలుగు దశల్లో దరఖాస్తులను పూర్తి చేయాల్సి ఉంటుంది. వచ్చిన దరఖాస్తులను ఏప్రిల్ 7వ తేదీనాటికి వడపోసి ఎంపికైన విద్యార్థుల జాబితాలను విడుదల చేస్తారు. మే నెల 18 నుంచి విద్యార్థులను ఆహ్వానిస్తారు. 19 నుంచి 30వ తేదీ వరకూ యువికా–25 కార్యక్రమం చేపడతారు. మే 31న ముగింపు కార్యక్రమం జరుగుతుంది. అదే రోజు ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తారు. ఎంపికైన విద్యార్థులకు ప్రయాణ, భోజన, వసతి ఏర్పాట్లును ఇస్రో పూర్తి ఉచితంగా అందజేస్తుంది. ఎంపికైన విద్యార్థులను మే నెలలో 14 రోజులు ఇస్రోకు చెందిన స్పెస్ సెంటర్లకు తీసుకువెళ్తారు. అక్కడి వింతలు, విశేషాలు, సప్తగహ కూటమి తదితర అంశాలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తారు.

ఎవరు అర్హులు

- ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న 9వ తరగతి విద్యార్థులు
- ఆన్‌లైన్ పరీక్షలో ప్రతిభ కనపర్చిన విద్యార్థులు
- 8వ తరగతిలో సాధించిన మార్కుల్లో 50 శాతం, మూడేళ్లలో పాఠశాల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిర్వహించిన సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శనల్లో పాల్గొంటే వాటి ఆధారంగా 2 నుంచి 10 శాతం, ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో చూపించిన ప్రతిభకు 10 శాతం వెయిటేజీ అందిస్తారు. ఎన్‌సీసీ, స్కౌట్, గైడ్స్ విభాగాల్లో ఉంటే 5 శాతం, పల్లె ప్రాంతాలకు చెందిన వారికి 15 శాతం ప్రాధాన్యం కల్పిస్తారు.

భావిశాస్త్ర వేత్తలకు ప్రోత్సాహం



భావిశాస్త్రవేత్తలను ప్రోత్సహించేందుకు ఇస్రో చేపడుతున్న యువికా కార్యక్రమాన్ని అర్హతగల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. సంబంధిత పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు పిల్లలకు సహకరించాలి. జిల్లా పరిధిలో డీవీఈఓలు, ఎంఈఓలు ఈ విషయంపై వారి పరిధిలో యంత్రాంగాన్ని చైతన్యపర్చాలి. పెద్ద సంఖ్యలో విద్యార్థులతో దరఖాస్తు చేయించాలి. – ఎన్.తిరుపతినాయుడు, జిల్లా విద్యాశాఖాధికారి, పార్వతీపురం మన్యం

జిల్లావ్యాప్తంగా సంసిద్ధం



గతంలో నిర్వహించిన అనేక సైన్స్ ఎగ్జిబిషన్లు, పోటీ పరీక్షల్లో మన జిల్లా విద్యార్థులు సత్తాచాటి జాతీయ స్థాయిలో వారి ప్రదర్శనలతో అబ్బురపర్చారు. ఇదే స్ఫూర్తితో పెద్ద సంఖ్యలో అర్హత గత విద్యార్థులను సిద్ధం చేస్తున్నాం. ఇప్పటికే 40 వరకూ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేశారు. ప్రస్తుత వేసవి సెలవుల్లో సమయం వృథా కాకుండా ఈ పర్యటనలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. – జి.లక్ష్మణరావు, జిల్లా సైన్స్ అధికారి, పార్వతీపురం మన్యం

మా పిల్లల భవిష్యత్తు ఏంటి?

- డీన్‌ను ప్రశ్నించిన పశువైద్య విద్యార్థుల తల్లిదండ్రులు



విద్యార్థులతో కలిసి నిరవధిక దీక్ష చేపట్టిన తల్లిదండ్రులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి వెటర్నరీ కళాశాల ఆవరణలో నెల రోజులపైబడి తమ సమస్యలను, డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చేపడుతున్న నిరవధిక దీక్షకు విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం మద్దతు తెలిపారు. కళాశాలకు వీసీఐ గుర్తింపును తీసుకురావాలని, ఎంబీబీఎస్ విద్యార్థుల మాదిరిగానే స్టైఫండ్‌ను అందించాలన్న న్యాయమైన కోరికలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పిల్లల భవిష్యత్తు ఏమిటో చెప్పాలని కళాశాల అసోసియేట్ డీన్ మక్కేన శ్రీనును ప్రశ్నించారు. నెలల తరబడి తరగతులు బహిష్కరించి నిరవధిక దీక్ష చేస్తున్నా స్పందించకపోవడంపై మండిపడ్డారు. దీనిపై డీన్ స్పందిస్తూ స్టైఫండ్ పెంపుదల అంశం ప్రభుత్వ పరిధిలో ఉందని, కళాశాల నుంచి రిలీవ్ అవుతున్న విద్యార్థులకు ఇతర కళాశాల గుర్తింపుతో బయటకు పంపిస్తామని, విద్యార్థులకు వీసీఐ గుర్తింపులో అన్యాయం జరగదని బదులిచ్చారు.

హంస వాహనంపై వేంకటేశ్వరస్వామి



ఆలయంలోని కోనేరులో హంసవాహనంపై విహరిస్తున్న వెంకటేశ్వరస్వామి

డెంకాడ: చింతలవలస ఐదవ ఏపీఎస్‌పీ బెటాలియన్ వద్ద ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న కోనేరులో వేంకటేశ్వరస్వామి హంస వాహనంపై విహరించారు. సోమవారం శ్రీనివాసుని కల్యాణం జరిగింది. విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దిన హంస వాహనంలో మంగళవారం సాయంత్రం శ్రీదేవి,భూదేవి సహితంగా స్వామివారు విహరించగా భక్తులు తిలకించారు.

గ్లకోమా వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: గ్లకోమా(నీటికాసులు) వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.జీవనరాణి సూచించారు. ప్రపంచ గ్లకోమా వారోత్సవాల సందర్భంగా స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద జెండా ఊపి మంగళవారం ఆమె ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్లకోమా అనేది కళ్లకు సంబంధించిన వ్యాధి అని, కంటి డ్రైనేజీ నిర్మాణాలు సరిగా పనిచేయకపోవడం వల్ల కంటి లోపల పీడనం పెరిగి నరానికి హాని కలుగుతుందని తెలిపారు. గ్లకోమా ప్రారంభ దశలో ఎటువంటి లక్షణాలు ఉండకపోవచ్చునన్నారు. క్రమంగా చూపు కోల్పోవచ్చునని హెచ్చరించారు. గ్లకోమా బారిన పడిన చాలామందికి తమకు వ్యాధి ఉందని తెలియదన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.రాణి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లీ పాహిమాం..!

- అట్టహాసంగా పోలిపల్లి పైడితల్లి జాతర
- చివరిరోజు వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- భక్తుల సేవలో తరించిన స్వచ్ఛంద, వ్యాపార సంస్థలు



గర్భగుడిలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



ఆలయం వద్ద భక్తజనసందోహం

రాజాం/రాజాం సిటీ: ఉత్తరాంధ్రుల ముత్తైదువుగా పేరొందని రాజాం పోలిపల్లి పైడితల్లి జాతర మంగళవారం వైభవంగా సాగింది. చివరి రోజు వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. కొండంపేటకు చెందిన లంకలపల్లి కుటుంబీకులు ఘటాలు తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించడంతో జాతర ముగిసింది. తొలిరోజు నుంచే వేల సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పసుపుకుంకుమలు సమర్పించి కోళ్లు, చీరలు చూపించి మొక్కుబడులు చెల్లించారు. జాతరకు వచ్చే భక్తులకు పలు స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారులు, దాతలు సేవలందించారు. తాగునీరు, మజ్జిగ, పులిహోర ప్రసాదాలను అందజేశారు. జాతర సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి. చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు, రాజాం సీఐలు అశోక్‌కుమార్, ఉపేంద్ర, ఎస్ఐ జనార్దనరావు తమ సిబ్బందితో కలిసి గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు. దేవదాయశాఖ ఈఓ మాధవరావుతో పాటు ఉన్నతాధికారులు, ఆలయ ధర్మకర్తలు, కమిటీ సభ్యులు జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

యువకుడి ఆత్మహత్య



ఉరి వేసుకున్న జగదీష్

గంట్యాడ: ప్రేమించిన యువతి తిరస్కరించిందని మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గంట్యాడ మండలంలోని కొత్తారుబిల్లి జంక్షన్‌కు చెందిన పారాదిజగదీష్(24) విశాఖపట్నం జిల్లాకు చెందిన ఓయువతిని ప్రేమించాడు. ఆమె తన ప్రేమను అంగీకరించకపోవడంతో కొంతకాలంగా మౌనంగా ఉంటున్నాడు. సోమవారం మధ్యాహ్నం మిస్‌యు ఆల్ అని స్నేహితులకు స్టేటస్ పెట్టి ఇంటినుంచి వెళ్లిపోయాడు. దీంతో ఈ విషయాన్ని పోలీసులకు తల్లిదండ్రులు చెప్పారు. చుట్టుపక్కల వెతకాలని పోలీసులు చెప్పడంతో జగదీష్ బంధువులు వెతకడం ప్రారంభించారు. మంగళవారం తెల్లవారుజామున కొత్తారుబిల్లి జంక్షన్‌లో ఉన్న ఆంజనేయస్వామి రోడ్డులో గల మామిడి తోటలో ఉరివేసుకుని చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. దీంతో మృతుని బంధువులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని కిందికి దించి పోస్టుమార్టం నిమిత్తం విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. మృతుని తండ్రి వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికృష్ణ తెలిపారు.

పాముకాటుకు గురై ఫీల్డ్ అసిస్టెంట్ మృతి



అర్నిపల్లి సత్య నారాయణ (ఫైల్)

రామభద్రపురం: మండలంలోని నాయుడువలసకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ పాము కాటుకు గురై చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటనపై కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ ఆర్నిపల్లి సత్యనారాయణ(36) గ్రామంలోని మామిడితోటలో ఉపాధి కూలీలు వారం రోజులుగా చేసిన ఉపాధి పనుల కొలతలు వేసేందుకు శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో వెళ్తుండగా తోటలో ఆకులు ఎక్కువగా ఉండడంతో ఆకుల కింద పాము ఉందన్న విషయం తెలుసుకోలేక కాలితో మట్టేశాడు. దీంతో ఆకుల కింద ఉన్న పాము కాటు వేయడంతో స్థానికులు మెరుగైన చికిత్స కోసం విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి 11 గంటల సమయంలో మృతిచెందాడు. మృతుని భార్య గత రెండేళ్ల క్రితం మృతి చెందింది. పెద్ద పాప జ్యోతి ఇంటర్‌మీడియట్ మొదటి ఏడాది పరీక్షలు రాస్తోంది. రెండవ పాప నిఖిత 7 వ తరగతి చదువుతోంది. తల్లిదండ్రులిద్దరూ చనిపోవడంతో పిల్లలిద్దరూ దిక్కులేని వారయ్యారు.

ఎన్నికల సమస్యలపై చర్చకు ఈసీ ఆహ్వానం

విజయనగరం అర్బన్: జిల్లా ఎన్నికల అధికారి, ఈఆర్‌ఓ, రాష్ట్ర సీఈఓ స్థాయిలో పరిష్కారం కాని ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సమస్యలు ఉంటే రాజకీయ పార్టీలతో చర్చించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఆయా రాజకీయ పార్టీల అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులతో చర్చించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం అన్ని జాతీయ, రాష్ట్రస్థాయి పార్టీలకు లేఖలు రాసినట్లు ఎన్నికల సంఘం డైరెక్టర్ అనిల్ చందక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయ పార్టీల నేతలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ముగ్గురి అరెస్టు

సీతంపేట: గతంలో సారా విక్రయిస్తూ పరారైన ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్సై వై.అమ్మన్నాయుడు మంగళవారం తెలిపారు. మండలంలోని ఆనపకాయలగూడ గ్రామానికి చెందిన సిమ్మయ్య సారా విక్రయిస్తుండగా పరారయ్యాడని, ఇప్పుడు పట్టుకున్నామని తెలిపారు. అలాగే ఇటీవల నెల్లిగండి గ్రామానికి చెందిన కె.తేజేశ్వరరావు 30 లీటర్ల సారా విక్రయిస్తూ పరారవడంతో పట్టుకుని ఇద్దరినీ కోర్టులో హాజరుపర్చినట్లు చెప్పారు.

దోనుబాయి పోలీస్‌స్టేషన్ పరిధిలో..

దోనుబాయి పోలీస్ స్టేషన్ పరిధిలో కోసంగి గ్రామంలో 20 లీటర్ల సారా పట్టుకున్నట్టు ఎస్సై అహ్మద్ తెలిపారు. ఈ కేసులో గౌరునాయుడిని అరెస్టుచేశామని చెప్పారు.

డీకేటీ రైతులకు అన్యాయం..!

- ఫార్మర్ రిజిస్ట్రేషన్‌లో సొంత పట్టాదారులకే నమోదు
- వారికే యూనిక్ ఐడీల కేటాయింపు
- డీకేటీ రైతులకు నమోదు అవదంటున్న అధికారులు
- ఆందోళనలో రైతులు



పార్వతీపురం మండలంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్‌లో పాల్గొన్న అధికారులు

పార్వతీపురంటౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమం కోసం వివిధ పథకాలు అమలు చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చాయి. రైతులకు ఆ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రస్తుతం వివిధ రకాల పద్ధతులను అవలంబిస్తున్నాయి. అయితే భవిష్యత్‌లో రైతులకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, పంటల యోజన బీమా, సబ్సిడీ పరికరాలు, పంట నష్టపరిహారం, ఎరువుల రాయితీ, కనీస మద్దతు ధర తదితర పథకాలను అందించేందుకు ప్రత్యేక కార్డులను అందించనున్నారు. ఇందుకోసం అర్హులైన ప్రతి రైతుకు ఆధార్ కార్డు తరహాలో వ్యవసాయ శాఖ ద్వారా 14అంకెల యూఐడీ కేటాయిస్తున్నారు. అయితే ఇప్పటివరకు సొంత పట్టా భూములు ఉన్న రైతుల వివరాలు మాత్రం నమోదు చేసి ఒక యూనిక్ ఐడీని కేటాయిస్తున్నారు. కానీ డీకేటీ పట్టాలు ఉన్న రైతుల వివరాలు నమోదు చేయడం లేదు. ఇందుకు ఆన్‌లైన్‌లో అనుమతించడం లేదని అధికారులు చెబుతున్నారు. దీంతో డీకేటీ రైతులు తమకు పథకాలు, నిధులు అందుతాయో లేదోనన్న ఆందోళనలో ఉన్నారు.

కేవలం పట్టాదారులకే నమోదు చేస్తారా?

జిల్లాలో గల 15 మండలాల్లో గడిచిన రెండు వారాలుగా అన్ని గ్రామాల్లో రైతులకు యూనిక్ ఐడీ నంబర్ కేటాయింపు కోసం వ్యవసాయ సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తున్నారు. రైతుల వద్దకు వెళ్లి వారి భూమి పాస్‌బుక్‌లు, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ ద్వారా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసి యూనిక్ ఐడీ కేటాయిస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని రైతుసేవా కేంద్రాల్లో కూడా నమోదు ప్రక్రియ జరుగుతోంది. కానీ డీకేటీ రైతులకు మాత్రం ఆన్‌లైన్‌లో నమోదు అవడం లేదంటూ చెప్పి పంపించేస్తున్నారు. కేవలం పట్టాదారులకే నమోదు చేస్తారా? అంటూ డీకేటీ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో డీకేటీ రైతుల వివరాలు

ఐటీడీఏ	డీకేటీ రైతులు	సాగు విస్తీర్ణం ఎకరాల్లో
పార్వతీపురం	12,120	17,528
సీతంపేట	12,135	18,955

యూనిక్ ఐడీ కోసం డీకేటీ భూములున్న ఏ ఒక్క రైతుకు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసేందుకు అనుమతి ఇవ్వడం లేదు. జిల్లాలో పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలో 24,245 మంది రైతులు డీకేటీ పట్టాలు కలిగి ఉన్నారు. రెండు ఐటీడీఏల పరిధిలో 36,483 మంది రైతులు నమోదు కావాల్సి ఉంది. ఆ రైతులందరూ యూనిక్ ఐడీ కార్డులు మాకు ఇవ్వరా? కార్డు ద్వారా సంక్షేమ పథకాలు అందిస్తే మా పరిస్థితి ఏమిటి అంటూ అధికారులను ప్రశ్నిస్తున్నారు.

అనుమతి వస్తే నమోదు చేస్తాం

ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే, వెబ్‌సైట్‌లో ఆప్షన్ వచ్చిన వెంటనే డీకేటీ రైతుల వివరాలు నమోదు చేస్తాం. ప్రస్తుతం సొంత పట్టాదారులకు సంబంధించి యూనిక్ ఐడీలను అప్‌లోడ్ చేస్తున్నాం. త్వరలోనే అనుమతి వస్తుందని సమాచారం. త్వరలో వారివి కూడా యూనిక్ ఐడీల నమోదు ప్రక్రియ చేపడతాం. – రాబర్ట్‌పాల్, జిల్లా వ్యవసాయశాఖాధికారి, పార్వతీపురం మన్యం

వన్‌ధన్ వికాస కేంద్రాలు వృద్ధి చెందాలి

- ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ

పార్వతీపురం: ఐటీడీఏ పరిధిలోని వన్‌ధన్ వికాస కేంద్రాలు వృద్ధి చెందాలని ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన తన కార్యాలయంలో వీడీవీకేల నిర్వహణ, యంత్రాల కొనుగోలుపై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీడీవీకేల ఉత్పత్తులు పెంచేందుకు అవసరమైన యంత్ర సామగ్రిని వారికి సమకూర్చి, వాటిపై శిక్షణ కార్యక్రమాలను నిర్వహించి, ఉత్పత్తులకు ఆకర్షణీయమైన ప్యాకింగ్ ఏర్పాటు చేసి మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వెలుగు ఏపీడీ, వెలుగు 8మండలాల ఏపీఎంలు, హెడ్‌క్వార్టర్ ఏపీఎంలు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయం మరమ్మతులకు మోక్షం




డీపీఓలో చేపట్టనున్న మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్, చిత్రంలో ఏఆర్ సిబ్బంది

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం, ఎస్పీ ఆఫీస్ భవనానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. ప్రస్తుత ఎస్పీ వకుల్ జిందల్ చొరవతో దాదాపు రూ.3 లక్షల వ్యయంతో పరిపాలన భవనం మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో చేపడుతున్న పలు అభివృద్ధి, మరమ్మతు పనులను ఎస్పీ వకుల్ జిందల్ మంగళవారం పరిశీలించారు. అభివృద్ధి, మరమ్మతు పనులను నాణ్యంగా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. మరమ్మతు పనుల పరిశీలనలో ఎస్పీ వెంట అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, డీపీఓ ఏఓ పి.శ్రీనివాసరావు, ఎస్బీ సీఐలు ఏవీ లీలారావు, ఆర్వీఆర్కే చౌదరి, మహిళా పీఎస్ సీఐ ఈ.నర్సింహమూర్తి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.గోపాల నాయుడు, ఆర్ఎస్సై వర ప్రసాద్ పాల్గొన్నారు.

దార్శనిక పత్రాల రూపకల్పనకు కసరత్తు

- 15న సలహాలు, సూచనల స్వీకరణకు సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: వికసిత్ భారత్–2047 లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్ర, జిల్లాల సత్వర అభివృద్ధి కోసం స్వర్ణాంధ్ర పేరుతో దార్శనికపత్రాలు రూపొందిస్తున్నట్టు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. నియోజకవర్గాల వారీగా అభివృద్ధి సాధనకు దార్శనిక పత్రాలను రూపొందించాలని సంకల్పించామన్నారు. ఆయా నియోజకవర్గాల పరిధిలో అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకొని స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఆయా శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధుల సూచనలు, సలహాలతో నియోజకవర్గ అభివృద్ధికి అనుగుణంగా దార్శనిక పత్రాలను రూపొందించేందుకు కసరత్తు ప్రారంభించామన్నారు. జిల్లాలోని మంత్రులు, ఎంపీలు, శాసనసభ్యులు, మండలి సభ్యులు, జెడ్పీ చైర్మన్, కార్పొరేషన్ల చైర్మన్‌లు, ఇతర ప్రజాప్రతినిధుల సూచనలు, సలహాలు స్వీకరించేందుకు ఈ నెల 15న కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

LAND FOR SALE

■ పాచిపెంట గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డుకి 1 KM దూరంలో కోడికాళ్ళవలస గ్రామంలో బోరు నీరు సదుపాయంతో 2.37 ఎకరాలు జిరాయితీ మెట్టు వ్యవసాయ భూమి అమ్మకానికి కలదు. డైరెక్ట్ పార్టీ ✆ 9949302456 [SCA25002041]

BUSINESS OFFER

■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబి డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-6239]

WANTED

■ కావలెను. కేర్ టేకర్స్, నర్సులు విజయవాడలో పేషంట్ల ఇళ్ళ వద్దనే ఉండి చూసుకొనుటకు అత్యధిక జీతం+వ+భో. ఆంధ్ర హోమ్ కేర్, VJA ✆ 91608 35559, 93473 80332 [B-513]

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీ:20k ఫోన్: 8977639663, 8977639662 [HA-1903]

■ కష్టపడేవారికి కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు,ఫ్రీ రూం+భోజనం. HYD. 6309020999 [HA-37]

■ Wanted 120 B.Sc. Chemistry 2020-24 Passed out, Male Candidates only. Immediate Joining at Tuni. Good Salary. Send resumes. Whatsapp 98493 54297 / 83670 48979 [V- 2164]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.